సాక్షి ప్రకాశం

గురువారం । 14 । ఆగస్టు । 2025



సముచితం కాదు.. సమస్యా భరితమే

ఉచిత బస్సు ప్రయాణం అమలుపై మహిళలు, అద్దె బస్సుల యజమానులను నిరుత్సాహంలోకి నెట్టింది.

- 8లో..



అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ మంచి అవకాశమని జేసీ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
28 /24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

స.హ చట్టంపై అవగాహన ఉండాలి

- జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ వరలక్ష్మి

ఒంగోలు సబర్బన్: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయ మార్కెటింగ్ సంచాలకులు ఎం.వరలక్ష్మి సూచించారు. ఈ మేరకు పాత గుంటూరు రోడ్డులోని జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులకు, ఏడీ కార్యాలయంలోని సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్లాక్‌బర్లీ అదనపు కొనుగోలుకు వినతి

- సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ ఆర్.గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుకు అదనపు కేటాయింపులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా స్థాయి పొగాకు కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలను ఆమోదించారు. కమిటీలో ఆమోదించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 930 మెట్రిక్ టన్నుల పొగాకును జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి వెంటనే ఆమోదించాలని కమిటీని ఆదేశించారు. అవసరమైన చోట రీ స్టాకింగ్ అండ్ రీ క్లాసిఫికేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. జిల్లాకు పొగాకు కొనుగోలుకు అదనపు కేటాయింపులు కావాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించేందుకు డీఎల్‌పీసీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డీఎం కాకర్ల హరికృష్ణ పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక



ఎంపికైన వాలీబాల్ జట్టుతో అధికారులు

ఒంగోలు సిటీ: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టును బుధవారం త్రోవగుంట జెడ్పీ హైస్కూల్లో ఎంపిక చేసినట్లు వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎండీ హజీరాబేగం తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ఎంపికలో ప్రతిభ కనబరిచిన ఆరుగురు బాలికలు, ఆరుగురు బాలురను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 18న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. బాలుర జట్టులో ఏ రాకేష్ (ఏ.పీ.ఎంజీబీ బీసీ వెల్ఫేర్ వేటపాలెం), బీ రాజేష్ (జెడ్పీహెచ్ఎస్ చాకిచెర్ల), బీ సెల్వరాజ్ (జెడ్పీహెచ్ఎస్ త్రోవగుంట), వీ మహేష్ (చాకిచెర్ల), డీ రవివర్మ (జెడ్పీహెచ్ఎస్ పాకల), సీహెచ్ హేమంత్ (పాకల), ఇద్దరిని స్టాండ్ బైగా ఆర్ కార్తికేయ (అలకూరపాడు), ఎస్ సాయి వినేష్ (అలకూరపాడు) ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలికల జట్టులో వీ నందన (జెడ్పీహెచ్ఎస్ అలకూరపాడు), పీ సుచరిత (అలకూరపాడు), కే జెస్సికా (అలకూరపాడు), టీ రిషిత ప్రియ (గవర్నమెంట్ హైస్కూల్ టంగుటూరు), కే గాయత్రి (జెడ్పీహెచ్ఎస్ గరల్స్ వేటపాలెం), ఏ పూజిత (జెడ్పీహెచ్ఎస్ బండ్లమూడి), స్టాండ్ బైగా ఐ వెంకట ప్రణతి (జెడ్పీహెచ్ఎస్ బండ్లమూడి) ఎంపికయ్యారు.

ట్యాక్స్ కన్సల్టెంట్స్ జిల్లా కమిటీ ఏకగ్రీవం



ట్యాక్స్ కన్సల్టెంట్స్ జిల్లా కమిటీ

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడుగా దివి రోశయ్య, కార్యదర్శిగా సీహెచ్ ఏబీఎస్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ కోశాధికారిగా కేవీ.సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్‌గా వై.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా కే.భార్గవ ప్రతాప్, వీఎస్.రాఘవేంద్ర కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.మణికంఠ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఏ.రమేష్ రెడ్డి, ఆర్.తేజ సూర్య కుమార్‌లు ఎన్నికైన వారిలో ఉన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ చేత రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి నెల్లూరు డివిజన్ కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ వై.కిరణ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం.సత్య ప్రకాష్, డిప్యూటీ డైరెక్టర్ డీఎంజీఓ టి.రాజశేఖర్, ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ రావులు పాల్గొన్నారు.

టారిఫ్ బూచి.. సిండి కేట్లు దోచి!



సింగరాయకొండ మండలానికి చెందిన ఓ రైతు 4 చెరువుల్లో టైగర్ రొయ్య సాగు చేస్తున్నాడు. వారంరోజుల కిందట 20 కౌంట్ కేజీ ధర రూ.595 లకు విక్రయించాడు. ఈలోగా ట్రంప్ టారిఫ్ రేటు 50 శాతం పెంచడంతో వ్యాపారి చెరువుల పట్టడం ఆపేశాడు. ఇప్పుడేమో కేజీ రూ.560 లకు కొంటానంటున్నాడు. ఒక ఎకరాకు సుమారు 2.50 టన్నులు రొయ్య వస్తుంది. ఆ ప్రకారం కేజీకి రూ.35 ల చొప్పున రూ.87,500 లు నష్టపోయాడు సదరు రైతు. అంతేకాక రొయ్యలు పట్టడం ఆలస్యం చేశారంటే రోజుకు రూ.5 వేల చొప్పున ఖర్చవుతుంది. వ్యాపారులు కొనుగోలు చేయటానికి ఆసక్తి చూపటం లేదని, దీంతో ఏదో ఒక ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

- మందగించిన ఆక్వా కొనుగోళ్లు
- వ్యాపారుల మాయాజాలంతో పడిపోతున్న రొయ్యల ధరలు
- జిల్లాలో 14 వేల ఎకరాల్లో సాగు
- జిల్లాలో ఏటా 50 వేల టన్నుల ఉత్పత్తి
- 12వేల టన్నులు ఎగుమతి
- గుదిబండగా మారుతున్న కరెంట్ చార్జీలు
- అందుబాటులోకి రాని ఫీడ్ మినరల్ ధరలు
- ఆక్వా రైతులను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

అంతర్జాతీయ విపణిలో 'డాలర్ల' సిరులు కురిపించే ఆక్వా రంగం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతోంది. 50 శాతం సుంకం విధించడంతో ఆక్వా రైతుకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఈ బూచిని చూపిస్తూ దళారులు దోపిడీకి తెరతీశారు. రోజురోజుకూ ధరలు పతనమవుతుండడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతమున్న తరుణంలో సాగు చేయాలా.. వద్దా...చేస్తే ఏరకం సాగుచేయాలన్న గందరగోళంలో పడిపోయాడు.

సింగరాయకొండ: ట్రంప్ సుంకాలతో జిల్లాలో ఆక్వా రైతు పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. జిల్లాలో 14 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. సింగరాయకొండ, టంగుటూరు, ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో ఐదు వేల మంది రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో 12 వేల ఎకరాల్లో టైగర్ రొయ్య, రెండు వేల ఎకరాల్లో వెనామీ రకాన్ని సాగు చేస్తున్నారు. ఏటా సుమారు 50 వేల టన్నులు ఉత్పత్తి అవుతోంది. అమెరికా, చైనా, రష్యా, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం తదితర దేశాలకు సుమారు 12వేల టన్నులు ఎగుమతి చేస్తున్నారు. అందులో సింహభాగం రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. నెలల వ్యవధిలో రెండు సార్లు సుంకాలు పెరగడంతో ఎగుమతులు భారీగా మందగించాయి. ఫలితంగా ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. వీటికి తోడు దళారుల దోపిడీతో ఆక్వా రైతులు సాగు చేయాలంటే భయపడిపోతున్నారు.

ధరలను శాసిస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు

రొయ్యల మార్కెట్‌ను ఎక్స్‌పోర్టు చేస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు శాసిస్తున్నాయి. ధరలను తమకు ఇష్టం వచ్చినట్లు తగ్గించేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆక్వా సాగు నిలిపి వేయటమే కాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి మాయాజాలం కారణంగా నెలరోజుల వ్యవధిలో ధరలు భారీగా పడిపోయాయి. 20 కౌంట్ టైగర్ రొయ్య ధర కేజీ రూ.680 ధర పలికింది. ట్రంప్ నోట టారిఫ్ మాట వచ్చిందో లేదో వ్యాపారులు సిండికేట్ అయి ధరలు అమాంతం తగ్గించేస్తున్నారు. ప్రస్తుతం 20 కౌంట్ టైగర్ రొయ్య ధర కేజీ రూ.560, 30 కౌంట్ ధర కేజీ రూ.460లు, వెనామీ రకం రొయ్య అయితే 30–40 కౌంట్ రూ.370, 100 కౌంట్ ధర కేజీ రూ.220 పలుకుతోంది. ఈ ధరలు ఇంకా పతనమైతే రైతులు రొయ్యల సాగు మానటం తప్ప వేరే గత్యంతరం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధరలు తక్కువ ఉన్నప్పటికీ కొనుగోలుకు వ్యాపారులు ముందు రావటం లేదు. పెద్ద రైతులు మాత్రమే కొంత వరకు అమ్ముకోగలుగుతున్నారు. చిన్న, సన్న కారు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఖర్చులు రావడం గగనమే...

ప్రస్తుతం చెరువుల లీజు, విద్యుత్ చార్జీలు, ఫీడ్ ధరలతో 100 కౌంట్ రావాలంటే కిలోకు రూ.230 నుంచి రూ.260 లు, అదే 50 కౌంట్‌కు చేరాలంటే కిలోకు రూ.340 నుంచి రూ.360లు, గరిష్ఠంగా 30 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.460 నుంచి రూ.500 లు ఖర్చవుతుంది. అదే 20 కౌంట్ రావాలంటే రూ.500 పైనే ఖర్చవుతుంది. ఎకరా సాగుకు సీడ్, సాగుకు అవసరమైన హెల్త్‌కేర్ మినరల్స్, కరెంటు చార్జీలు, కూలీ ఖర్చులు అన్నీ కలుపుకుని సుమారు రూ.7.50 లక్షలు వ్యయం అవుతుంది. ధరలు ఇంకా పతనమైతే రైతులు ఆర్థికంగా కుదేలు కావాల్సిందేనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

తగ్గని ఫీడ్ చార్జీలు

రొయ్యల ఫీడ్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీని కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫీడ్ తయారీలో రా మెటీరియల్ ధరలు బాగా పెరిగాయని పెంచిన ఫీడ్ ఫ్యాక్టరీ యజమానులు ప్రస్తుతం ఫీడ్‌లో ఉపయోగించే సోయాబీన్స్ ధరలు బాగా తగ్గినప్పటికీ ధరలు మాత్రం తగ్గించటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పెద్ద రైతులకు ఫీడ్‌ధర కేజీ రూ.88 నుంచి రూ.90 లకు లభిస్తుంటే చిన్న, సన్న కారు రైతులకు కేజీ ధర రూ.100 లకు లభిస్తుందని తెలిపారు.

మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి..

ప్రస్తుతం మార్కెట్లో ధరల ప్రకారం రైతుకు కష్టకాలమే. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా రొయ్యల కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేని పక్షంలో వ్యాపారులపై ఒత్తిడి చేసి ధరలు పెరిగేలా చేస్తేనే తప్ప ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

యూనిట్ విద్యుత్ ధర రూ.1.50 లకే హామీ గాలికి

ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఆక్వా సాగు చేసే ప్రతి రైతుకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అంతేకాక సబ్సిడీపై ఏరియేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర ఆక్వా సంబంధిత పరికరాలు అందిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలోకి తొక్కింది. రైతులు లక్షలాది రూపాయలు కరెంటు బిల్లులు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతూ అదనపు భారాన్ని మోస్తున్నారు. ఒక చెరువుకు కరెంటు యూనిట్ ధర రూ.4.50 ప్రకారం రూ.50 వేలు కరెంటు బిల్లు వస్తే ట్రూఅప్ చార్జీల పేరుతో అదనంగా మరో రూ.50 వేలు కలిపి మొత్తంగా లక్ష రూపాయల బిల్లు వచ్చిందని, ఈ ప్రకారం యూనిట్ ధర సుమారు రూ.8 చెల్లిస్తున్నామని ఆక్వా రైతులు వాపోతున్నారు.

సుమారు 35 వేల మంది ఉపాధికి గండి..

కొత్తపట్నం, రాజుపాలెం, గవండ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరుల్లో హేచరీలున్నాయి. హేచరీల వద్ద 12 వేల మంది, అలాగే చెరువులపై 10 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. జిల్లాలోని మరో 5 ప్రాసెసింగ్ ప్లాంట్ల వద్ద మరో 10 వేల మంది, వీరితోపాటు అనుబంధ రంగాల కార్మికుల ఉపాధికి గండి పడనుంది.

బీ అలర్ట్..!

- భారీ వర్షాల హెచ్చరికలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంతో పాటు 1077 నంబరుతో టోల్ ఫ్రీ ఏర్పాటు
- అత్యధికంగా మద్దిపాడులో 198.4 మి.మీ వర్షపాతం నమోదు
- దొంగలవాగు పొంగి కర్నూలు మార్గంలో గంట పాటు ట్రాఫిక్‌జాం



కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగలవాగు



చోళ్లవీడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ



కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తన కార్యాలయం నుంచి బుధవారం తహశీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలు, కూలిపోయే అవకాశం ఉన్న పాత ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. చిన్నారులు, మహిళలు, గర్భిణులు, వృద్ధులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె చెప్పారు. స్థానికంగా ఉన్న కాలువలు, వాగులు, వంకలు, ఇతర నీటి వనరులు ఉధృతంగా ప్రవహిస్తున్న చోట అటువైపుగా వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్‌ఏ, వీఆర్వోలను ఆయా ప్రాంతాల్లో కాపలాగా ఉంచాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించేలా అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా సమస్య ఎదురైనా, సహాయం అవసరమైనా ప్రజలు వెంటనే జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చేలా కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 16వ తేదీ వరకు 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమును కూడా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఈ కంట్రోల్ రూములో షిఫ్టులు వారీగా పని చేసేలా విధులు కేటాయించారు. ఇదేవిధంగా మండల, డివిజన్ల స్థాయిలోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అత్యధికంగా మద్దిపాడులో 198.4 మి.మీ వర్షం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకు ఒక్కరోజులో కురిసిన వర్షం ఆగస్టు నెల మొత్తంలో కురవాల్సిన సరాసరి వర్షపాతంలో 28.6 శాతంగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మద్దిపాడు మండలంలో 198.4 మిల్లీ మీటర్ల వర్షం (19.8 సెంటీ మీటర్లు) కురిసింది. అత్యల్పంగా కొమరోలు మండలంలో కేవలం 4 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఇక మండలాల వారీగా నాగులుప్పలపాడులో 103.4 మి.మీ., కొత్తపట్నంలో 100.6, ఒంగోలు రూరల్ 62.2, ఒంగోలు అర్బన్ 62.2, దర్శి 61.6, సంతనూతలపాడు 46.8, కురిచేడు 41.4, చీమకుర్తి 41.4, తాళ్లూరు 30, మద్దిపూడి 21.8, హనుమంతునిపాడు 21.8, పుల్లలచెరువు 21, త్రిపురాంతకం 20.6, పొదిలి 16.8, యర్రగొండపాలెం 16.4, కొండపి 14.4, టంగుటూరు 14.2, సింగరాయకొండ 13.8, దొనకొండ 13.4, అర్ధవీడు 13.2, పెద్దారవీడు 12.8, కొనకనమిట్ల 12.6, బేస్తవారిపేట 12.6, సీఎస్‌పురం 12.6, మార్కాపురం 12.2, కంభం 11.8, జరుగుమల్లి 10.4, తర్లుపాడు 8.6, ముండ్లమూరు 8.4, కనిగిరి 8, పామూరు 6.8, పొన్నలూరు 6.6, వెలిగండ్ల 6, రాచర్ల 5.4, దోర్నాల 4.6, పెదచెర్లోపల్లి 4.56, గిద్దలూరు 4.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మరోసారి పొంగిన దొంగలవాగు:

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల పరిధిలోని పలు వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో పలు చోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దొంగలవాగు మరో సారి ఉధృతంగా ప్రవహించటంతో కర్నూలు రహదారిలో కొత్తూరు వద్ద ఉన్న వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ ప్రాంతం వద్ద బుధవారం ఉదయం గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

■ రాచర్ల మండలంలో గుండ్లకమ్మ వాగు పరవళ్లు తొక్కుతూ రామన్నకతువ నిండి దిగువకు ప్రవహిస్తోంది. అకవీడులోని తురకవాని చెరువు, దొడ్డేని చెరువులు నిండి అలుగుపారుతున్నాయి.

వార్డెన్ బదులు బినామీ వార్డెన్ విధులు

- బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ కలెక్టర్

చీమకుర్తి: హాస్టల్ విధులు నిర్వహించాల్సిన వార్డెన్ తన ప్లేస్‌లో బినామీ వార్డెన్‌ను పెట్టుకొని తన విధులకు తరచూ డుమ్మా కొడుతున్నట్లు డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి విచారణలో తేటతెల్లమైంది. మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్ కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి పార్థసారధి బుధవారం చీమకుర్తిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలిక జడను పూర్తిగా గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించటంతో హాస్టల్‌లోని దయనీయ పరిస్థితులపై కొమ్ము సుజన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తనిఖీకి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ హాస్టల్‌లోని బాలికలను విడివిడిగా విచారించి హాస్టల్‌లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ ఎప్పుడో ఒకసారి వస్తుందని, ఆమె బదులు మరొక మహిళను బినామీగా పెట్టి హాస్టల్ బాధ్యతలను పర్యవేక్షించేలా చేసినట్లు గుర్తించారు. హాస్టల్‌లో మెనూ పాటించటం లేదని, పిల్లల కడుపు కాలుస్తున్నారని, తాగటానికి సురక్షితమైన మంచినీరు లేదని, 180 మంది పిల్లలకు ఒకటి రెండు బాత్‌రూములు మాత్రమే ఉన్నాయని, హాస్టల్‌లోని దయనీయ పరిస్థితుల వివరాలను డిప్యూటీ కలెక్టర్ విచారణలో స్పష్టమైంది. విచారణ అనంతరం మాదిగ సంక్షేమ పోరాట సమితి నాయకులు కొమ్ము సుజన్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు హాస్టల్‌లోని పరిస్థితులపై డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



డిప్యూటీ కలెక్టర్‌ను కలిసిన ఎంఎస్‌పీఎస్ నాయకులు

జగన్‌ను కలిసిన బత్తుల, రమణారెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన బత్తుల బ్రహ్మానందరెడ్డి, కేవీ.రమణారెడ్డి

ఒంగోలు సిటీ: తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కేవీ రమణారెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం వివరాలు, జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు తెలిపారు.

మార్కాపురంలో ఇసుక మాఫియా

- ప్రకాశం భవన్ ముందు లారీ అసోసియేషన్ ధర్నా
- మార్కాపురం ఎమ్మెల్యే పక్షపాతం చూపిస్తున్నారని ధ్వజం



ప్రకాశం భవన్ ముందు ధర్నా చేస్తున్న మార్కాపురం లారీ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: మార్కాపురంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని మార్కాపురం లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కాశీరాం సింగ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు మార్కాపురం నుంచి వచ్చిన లారీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు ప్రకాశం భవన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాశీరాం సింగ్ మాట్లాడుతూ మార్కాపురంలో ఇసుక డిపో నుంచి అధిక ధరలకు ఇసుకను అమ్ముతూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. మార్కాపురం ప్రజలను ఇసుక మాఫియా నుంచి కాపాడాలంటూ నినాదాలు చేశారు. అత్యధిక ధరలకు ఇసుకను విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఒక్కో టన్నుకు రూ.400 కమీషన్ రూపంలో తీసుకుంటున్నారని, యార్డ్ నిర్వాహకుడు గొట్టిపాటి సూరి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణ రెడ్డి వైఖరి కూడా సరిగా లేదంటూ ధ్వజమెత్తారు. మైన్స్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పటంతో ఒంగోలు వచ్చామని అయితే అధికారులు స్పందించలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉప్పలదిన్నె శ్రీనివాస రావు, బాలాజీ సింగ్, పఠాన్ ఖాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు

- వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దాడాల సుబ్బారావు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దాడాల సుబ్బారావు

కనిగిరిరూరల్: దేశంలో వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తులు ప్రవేశించి, పూర్తిగా హస్తగతం చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాడాల సుబ్బారావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా 17వ మహాసభల సందర్భంగా రెండో రోజు ప్రతినిధుల సభ బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి పోవడంతో రైతులకు గిట్టుబాటు ధరలు లేక, అప్పులు పెరిగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడి కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో పనులు తగ్గిపోవడం వలన వ్యవసాయ కూలీలు పనులు లేక అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని, ఏడాదికి 200ల రోజులు పని దినాలు పెంచాలని, పనులు లేని రోజుల్లో ఉపాధి కూలీలకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జాలా అంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాల నాగయ్య, మల్లెల సంపూర్ణ, ఉబ్బా వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగులకు 12వ పీఆర్సీ ప్రకటించాలి

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో సంఘ జిల్లా కార్యదర్శి గోపీకృష్ణ ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు రజిత మానస, రోడ్డు భవనాల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

● మరో ఏడుగురికి గాయాలు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): వేగంగా వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఒక వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లూరు నుంచి ఒంగోలు వస్తున్న ప్యాసింజర్ ఆటో పేర్నమిట్ట చెరువు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒంగోలు ముంగమూరు రోడ్డులో నివసిస్తున్న ఒడ్డువానికుంట గ్రామానికి చెందిన సంద్ర కోటమ్మ(65) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఏడుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిలో స్వల్ప గాయాలైన నలుగురిని జీజీహెచ్‌కు, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముచితం కాదు.. సమస్యా భరితమే!

- మహిళకు ఉచిత ప్రయాణంపై హైర్ బస్సుల యాజమానులు హడల్
- రద్దీ పెరిగి బస్సులు దెబ్బతింటాయని ఆందోళన
- ఫ్రీ బస్సుల్లో 40 శాతం అద్దె ప్రాతిపదికన తిప్పేవే..
- జిల్లాలో 4 డిపోల్లో సుమారు 120 హైర్ బస్సులు



కనిగిరి ఆర్టీసీ డిపోలో హైర్ బస్సులు

కనిగిరిరూరల్: రాష్ట్రమంతటా ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఎన్నికల వేళ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం షరతులు, పరిమితులతో తుస్సుమనిపించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని గొప్పగా చెబుతున్న కూటమి సర్కారు అటు అక్కచెల్లెమ్మలనే కాదు ఇటు అద్దె బస్సుల యజమానులనూ నిరుత్సాహంలోకి నెట్టింది. ఆర్టీసీలో తొమ్మిది రకాల సర్వీసులు ఉన్నప్పటికీ పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి జిల్లాలో అల్ట్రా పల్లె వెలుగు సర్వీసులు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలోనూ లేకపోవడం గమనార్హం.

బస్సులు గుల్లవుతాయ్..

ఉచిత ప్రయాణానికి నిర్ణయించిన పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో 35 నుంచి 40 శాతం వరకు అద్దె(హైర్) బస్సులున్నాయి. అయితే వీటి యజమానులు ఉచితం మాటున తమకు జరిగే నష్టాన్ని ఊహించుకుని తీవ్ర ఆలోచనలో పడి ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఒంగోలు డిపోలో సుమారు 50, కనిగిరి డిపోలో 27, మార్కాపురం డిపోలో 22, పొదిలి డిపోలో 20 వరకు హైర్ బస్సులు.. వెరసి 4 డిపోల పరిధిలో 120 వరకు అద్దె బస్సులున్నాయి. వీటిని పూర్తిగా మహిళల ఉచిత ప్రయాణానికి వినియోగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కనిగిరి డిపోలో మొత్తం 107 బస్సులు ఉండగా, ఉచిత ప్రయాణానికి కేటాయించిన 47 బస్సుల్లో సగం అద్దెవే కావడం గమనార్హం. హైర్ బస్సుల్లో పల్లె వెలుగు సీటింగ్ సామర్థ్యం 55 నుంచి 60 మంది వరకు, ఎక్స్ ప్రెస్‌ల్లో 45 నుంచి 50 మంది వరకు ఉంటుంది. లీటర్ డీజిల్‌కు 5 నుంచి 6 కిలోమీటర్లు ప్రయాణించాలి. ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల మైలేజ్ పడిపో'వడమే కాకుండా మెయింటెనెన్స్ ఖర్చు పెరుగుతుంది. మైలేజ్ షార్టేజ్ వస్తే ఆ భారాన్ని యజమానులే భరించాలన్నది నిబంధన. ఈ నేపథ్యంలో అద్దె బస్సుల నిర్వహణ తలకు మించిన భారంగా మారుతుందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీతో కుదుర్చుకున్న అగ్రిమెంట్‌లో 'ఉచిత ప్రయాణం' ప్రస్తావనే లేదని, దీనిపై చర్చించాల్సి ఉందని కొందరు యజమానులు చెబుతున్నారు. ఇన్ని సమస్యల నడుమ 'మహిళల ఉచిత బస్సు ప్రయాణం'కు అద్దె బస్సుల యజమానులు ఏమాత్రం సహరిస్తారో వేచి చూడాల్సిందే. ప్రణాళికాబద్ధంగా లేని స్త్రీ శక్తి పథకం ఆరంభశూరత్వమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: మార్కాపురం ఆర్టీసీ డిపోలో ఈనెల 11వ తేదీన ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడైన క్రిష్టిపాటి వెంగళరెడ్డిని ఇక్కడి కారు స్టాండు వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ డాక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో సీఐ పి.సుబ్బారావుతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈదర గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డి, క్రిష్టిపాటి వెంగళరెడ్డి మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో వెంగళరెడ్డి కుమారుడు కొండారెడ్డి హత్యకు గురికాగా బాపిరెడ్డిపై కేసు నమోదైంది. మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయస్థానంలో కేసు విచారణలో ఉంది. తన కుమారుడిని కళ్లెదుటే చంపడాన్ని జీర్ణించుకోలేకపోయిన వెంగళరెడ్డి.. ఎక్కడో ఉంటూ కోర్టుకు హాజరవుతున్న బాపిరెడ్డిని హతమార్చేందుకు పథకం రచించాడు. ఈనెల 11న బాపిరెడ్డి కోర్టుకు హాజరై బ్రహ్మంగారిమఠం వెళ్లేందుకు బస్సులో ఎక్కి కూర్చున్నాడు. వెంగళరెడ్డి తనను ఎవరూ గుర్తుపట్టకుండా ప్యాంటు, షర్టు ధరించి, ముఖానికి మాస్కు పెట్టుకుని బస్సులో కూర్చుని ఉన్న బాపిరెడ్డి కళ్లలో కారం కొట్టాడు. అప్రమత్తమైన బాపిరెడ్డి గట్టిగా కేకలు వేస్తూ కిందకు దిగడం, స్థానికులు గుమిగూడటంతో వెంగళరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఈ నెల 12 వెంగళరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.


ఎమ్మెల్యే కళ్లలో ఆనందం కోసం..

- కొత్తపట్నంలో పెళ్లికి ఎమ్మెల్యే దామచర్ల వస్తున్నాడని వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు తొలగింపు
- ఇళ్లపై కట్టిన ఫ్లెక్సీలను సైతం పీకేయడంపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం



పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపట్నం: రెడ్ బుక్ రాజ్యాంగం జడలు విప్పుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన దరిమిలా వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. బుధవారం కొత్తపట్నం సమీపంలోని నల్లూరి గార్డెన్‌లో టీడీపీ నేత కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వస్తున్నాడని ఆ పార్టీ నేతలు పంచాయతీ కార్యదర్శితో కలిసి ఓవరాక్షన్ చేయడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చంద్రబాబు మోసపూరిత హామీలపై కొత్తపట్నం ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం ఆ పార్టీ నేతల ఆగ్రహానికి కారణమైంది. సొంత ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను కూడా తొలగించాల్సిందేనని, తమపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి ఉందని కార్యదర్శి చెప్పడంతో వైఎస్సార్ సీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. శ్మశానంలో ఫెన్సింగ్ రాళ్లకు ప్రజల సొమ్ముతో పసుపు రంగు ఎలా వేశారని ప్రశ్నించారు. ×అన్ని పార్టీల వారు ఫ్లెక్సీలు కట్టుకుంటారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎందుకు కొత్త సంస్కృతి తీసుకొస్తున్నారÕని నిలదీశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టుకు వెళ్తామని హెచ్చరిస్తున్నా కార్యదర్శి మాత్రం బలవంతంగా ఫ్లెక్సీలు తొలగించారు.



కొత్తపట్నంలో శ్మశానం ఫెన్సింగ్ రాళ్లకు పసుపు రంగు

బోగస్ కంపెనీలకు భూములు కట్టబెట్టారు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని ఖరీదైన భూములను ముఖ్యమంత్రి చంద్రబాబు బోగస్ కంపెనీలకు కట్టబెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. స్థానిక మల్లయ్య లింగం భవన్లో సీపీఐ రాష్ట్ర మహాసభల కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ కంపెనీనైతే బోగస్ కంపెనీ అంటూ ఆరోపణలు చేశారో అధికారంలోకి వచ్చిన తరువాత అదే కంపెనీకి కరేడు భూములను కట్టబెట్టడం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. విశాఖపట్నంలో 99 పైసలకే రూ.420 కోట్ల విలువ చేసే ఎకరా భూమిని కట్టబెట్టారని విమర్శించారు. ఏడాదికి మూడు పంటలు పండే వందల ఎకరాల భూములను సూట్‌కేస్ కంపెనీలకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. 53 వేల ఎకరాల్లో అమరావతి నిర్మాణం అని చెప్పిన చంద్రబాబు నేడు లక్ష ఎకరాలను ఎవరి ప్రయోజనాల కోసం సేకరిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అమరావతికి కేవలం 40 కిలోమీటర్ల దూరం ఉన్న గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయకుండా 33 కిలో మీటర్ల దూరంలో మరో ఎయిర్ పోర్టు నిర్మించేందుకు 56 ఎకరాలను సేకరించడం వెనక మతలబేమిటో చెప్పాలన్నారు. మదనపల్లి హేచరీలో ఎయిర్ పోర్టు నిర్మించి దొంగబాబా రాందేవ్‌కు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీ, అమిత్ షాలతో కలిసి దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. పీ4 పేరుతో చంద్రబాబు హడావుడి చేస్తున్నారని విమర్శించారు. ఆర్థిక, సామాజిక మూలాల్లో మార్పు తీసుకొని రాకుండా పేదరికం రూపుమాపడం సాధ్యం కాదన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా వెయ్యి మంది కళాకారులు, 100 పాటలతో, 100 డప్పులతో 100 కళారూపాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీ భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేయండి.. పన్ను పరిధిని విస్తరించండి

● జీఎస్టీ వసూళ్లపై సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: గూడ్స్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ) కోసం ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో కమర్షియల్ ట్యాక్స్, ఇతర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ.40 లక్షల టర్నోవర్(వస్తువుల విషయంలో), రూ.20 లక్షల టర్నోవర్(సేవల విషయంలో) దాటిన వ్యాపార సంస్థలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. పన్ను బకాయిదారుల ఆస్తుల వివరాలను కమర్షియల్ ట్యాక్స్ విభాగానికి అందజేయాలని జిల్లా రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పన్ను ఎగవేతదారులపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. రూ.2.5 లక్షల విలువకు మించిన సరఫరా ఒప్పందాలపై టీడీఎస్ మినహాయించి జీఎస్టీఆర్–7 ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. పన్ను లేకుండా గ్రానైట్, ఇతర సరుకుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, మైనింగ్ శాఖలు కమర్షియల్ ట్యాక్స్ విభాగంతో కలిసి పనిచేయాలని సూచించారు. రూ.10 లక్షల వార్షిక టర్నోవర్ దాటిన వ్యాపార సంస్థలు, డాక్టర్లు, ఆర్కిటెక్టులు ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ వై.కిరణ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఎం.సత్య ప్రకాష్, ఒంగోలు–1, ఒంగోలు–2, మార్కాపురం సర్కిళ్ల అసిస్టెంట్ కమిషనర్లు, మైన్స్ డీడీ రాజశేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర రావు, డీఈఓ కిరణ్ కుమార్, డీటీసీ ఆర్.సుశీల ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోప

ఒంగోలు సబర్బన్: అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్ మంచి అవకాశమని ఒడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై సర్వేయర్లతో పాటు క్రెడాయ్, నారెడ్కో, బై, కాన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజినీర్స్, సర్వేయర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్, ఆర్కిటెక్ట్స్ అండ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్, ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్స్, వెల్ఫేర్ అసోసియేషన్స్, ఎన్జీఓస్, ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్స్, ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30.06.2025కి ముందుగా వేసిన అనధికార లేఔట్లలో ప్లాట్లను చట్టబద్ధం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప అపరాధ రుసుంతో ఎల్ఆర్ఎస్ ద్వారా అవకాశం కల్పించిందని చెప్పారు. జూలై 26వ తేదీ నుంచి 45 రోజుల్లోగా పూర్తి రుసుం చెల్లిస్తే 10 శాతం రాయితీ, 45 రోజుల తర్వాత 90 రోజుల్లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. అక్టోబర్ 24వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. సమావేశంలో ఒడా ప్లానింగ్ ఆఫీసర్ బాబూరావుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.